సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 26 । జనవరి । 2024



ఇక తప్పించుకోలేరు..

అటవీ ప్రాంతం నుంచి సంపదను తరలించే అక్రమార్కులకు చెక్ పెట్టేలా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు.

IVలో



వైద్యుల నిర్లక్ష్యంతో ఇద్దరు బలి

ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యంతో తల్లీబిడ్డలు మృతి చెందిన ఘటన రామవరం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో చోటుచేసుకుంది.

IIలో

గరిష్టం / కనిష్టం
35° / 17°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలి ప్రభావం ఎక్కువగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం



స్వామివారికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, గురువారం సందర్భంగా స్వర్ణలక్ష్మీ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

డీఎంహెచ్‌ఓకు అవార్డు



అవార్డు అందుకుంటున్న డీఎంహెచ్‌ఓ శిరీష

కొత్తగూడెంరూరల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జేవీఎల్ శిరీష గురువారం హైదరాబాద్‌లో ఉత్తమ అవార్డు అందుకున్నారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయడంతో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియానా జెడ్ చోంగ్తూ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. అంతే కాక జిల్లాలోని 22 పీహెచ్‌సీలలో ఎన్‌క్వాస్ కింద అభివృద్ధి పనులు చేపట్టడంతో మరో అవార్డు కూడా వచ్చింది. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, డీఎంఈ త్రివేణి, ప్రజారోగ్య సంచాలకులు రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ



స్వప్నను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో ఈనెల 23న నిర్వహించిన చెస్ పోటీల్లో అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న టి.స్వప్న ప్రతిభ కనబర్చింది. ఇంటర్ సొసైటీ లీగ్ పోటీల్లో భాగంగా జోనల్ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో స్వప్న తృతీయ స్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.సాగర్, అధ్యాపకులు ఎస్‌కే చాంద్‌పాషా, డి. నరసింహారావు, శ్రీనివాసరావు, శ్రీధర్, ఎస్‌కే షాహెదా తదితరులు అభినందించారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో శుక్రవారం నిర్వహించే గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. ఉదయం 9 గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందని, ఆ తర్వాత పోలీసుల గౌరవ వందనం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రసంగం, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

జూలూరుపాడు వాసికి డాక్టరేట్



కిలారు సురేష్

జూలూరుపాడు: జూలూరుపాడు మండలం కొత్తూరు గ్రామపంచాయతీ పరిధి జడలచింతకు చెందిన కిలారు సురేష్‌కు డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ పోలా సోమేశ్వర్ పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనా గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన రామయ్య – నాగమణి దంపతుల కుమారుడైన సురేష్ కష్టపడి చదువుకుని పీహెచ్‌డీ పూర్తిచేయడంపై ఓయూ కెమిస్ట్రీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ బి.మనోహర్, బీఓఎస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ పీ.వీ.అనంతలక్ష్మితో పాటు గ్రామస్తులు గురువారం అభినందించారు.

మాట్లాడుతున్న ఎంపీ మాలోత్ కవిత, పక్కన ఖమ్మం ఎంపీ నామ, కలెక్టర్ ప్రియాంక అల తదితరులు (ఇన్‌సెట్) హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు





సంక్షేమాన్ని క్షేత్రస్థాయికి చేర్చాలి

కేంద్ర పథకాలపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరం

- జిల్లా సమగ్రాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం
- సీఎస్సార్ నిధులపై నివేదికలు అందజేయండి
- దిశ కమిటీ సమీక్షలో ఎంపీలు కవిత, నామ

చుంచుపల్లి: జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండాలని మహబూబాబాద్, ఖమ్మం ఎంపీలు మాలోత్ కవిత, నామ నాగేశ్వరరావు అన్నారు. దిశ కమిటీ సమావేశంలో చర్చించిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ(దిశ) కమిటీ సమావేశానికి హాజరైన ఎంపీలు.. జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల తీరుతెన్నులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇల్లెందులో రైల్వే స్టేషన్ ఏర్పాటుపై గత దిశ కమిటీ సమావేశంలో చర్చించామని, ఎంత మేర ప్రగతి సాధించారో తెలియజేయాలని రైల్వే అధికారులను ఆదేశించారు. స్టేషన్ స్థలాన్ని చుట్టుపక్కల వారు ఆక్రమించారని అధికారులు చెప్పగా.. రైల్వే స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందజేయాలని సూచించారు. దీనిపై చర్య తీసుకోవాలని కలెక్టర్‌కు చెప్పారు. కొత్తగూడెం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లు రద్దు చేయడంపై కమిటీ సభ్యులు ప్రశ్నించగా మార్చి నెలాఖరు వరకు అన్ని రైళ్ల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఎంపీలు రైల్వే అధికారులను ఆదేశించారు. భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి వైద్యులను నియమించాలని, ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో సదరం క్యాంపులు నిర్వహించాలని, ఏజెన్సీ ప్రాంతమైన చర్లలో ఆరోగ్య సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. దిశ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు సాగాలని, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద జిల్లాకు మంజూరైన పనులు, ఇప్పటికే చేపట్టిన, ఇంకా చేపట్టాల్సిన పనులపై సమగ్ర నివేదికలు అందజేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సింగరేణి సంస్థ నుంచి రావాల్సిన డీఎంఎఫ్, సీఎస్‌ఆర్ నిధులపై నివేదికలను అందజేయాలన్నారు. కాగా, తాము ప్రతిపాదించిన పనులకు కూడా సీఎస్సార్ నిధులు ఎందుకు ఇవ్వలేదంటూ ఆరా తీశారు. పాండురంగాపురం నుంచి భద్రాచలం వరకు రైల్వేలైన్ పొడిగింపు చర్యలపై నివేదిక సమర్పించాలని చెప్పారు.

మార్చి నాటికి 'గిరి వికాసం'

అటవీ శాఖ అనుమతుల్లో జాప్యంతో గిరి వికాసం పథకం కింద బోర్లు వేయడం ఆలస్యమైందని, మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారిపై ఆర్చీల ఏర్పాటుకు అనుమతులు జారీ చేయాలని జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సదరం క్యాంపుల నిర్వహణ సమాచారాన్ని వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా తెలియజేస్తున్నామని చెప్పారు. ఆస్పత్రుల్లో సౌకర్యాలు కల్పనకు ప్రతిపాదనలు అందజేయాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీల భర్తీకి చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశంలో భద్రాచలం, వైరా ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, మాలోత్ రాందాస్‌నాయక్, జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మితో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎవరేమన్నారంటే..

- భద్రాచలం 200 పడకల ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ లేక గర్భిణులు ఇబ్బంది పడుతున్నారని, వైద్యులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని దిశ కమిటీ సభ్యులు లకావత్ వెంకటేశ్వర్లు కోరారు.
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిర, ఖమ్మం, భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ స్కీంలో అభివృద్ధి చేస్తున్నామని, వాహనాల పార్కింగ్ స్థలాలు, ప్రయాణికులు వేచి ఉండేలా వసతులు కల్పిస్తున్నామని రైల్వే అధికారులు తెలిపారు.
- దుమ్ముగూడెం మండలంలో పలు గ్రామాలకు రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం లేదని, త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కోరారు.
- మన ఊరు – మనబడి కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, భవన నిర్మాణాలు పూర్తి చేయాలని కమిటీ సభ్యులు కోరారు.
- కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఎదుట రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, స్టేషన్ ఎదురుగా ఉన్న స్థలంలో కొంత రోడ్డు వెడల్పుకు కేటాయించాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ రైల్వే అధికారులను కోరారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో వైభవంగా చండీ హోమం

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం వైభవంగా చండీహోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేద మంత్రాలతో అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగింపుగా యాగశాలకు తీసుకొచ్చి మండపారాధన, గణపతి పూజ చేశారు. ఆ తర్వాత హోమం జరిపించి, చివరన పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హోమంలో పాల్గొన్న 14 మంది దంపతులకు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు, చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింత నాగరాజు, సంకా వెంకటరామారావు పాల్గొన్నారు. కాగా, అమ్మవారిని దేవాదాయ ధర్మాదాయశాఖ వరంగల్ ఉపకమిషనర్ శ్రీకాంతరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. కమిషనర్ కార్యాలయం సూపరింటెండెంట్



హోమం చేస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిలకలగండి ఆలయంలో పూజలు..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం వద్ద గల శ్రీ చిలకలగండి అమ్మవారిని శ్రీకాంతరావు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆదాయ, వ్యయాలు, సౌకర్యాలపై ఈఓ సూర్య ప్రకాష్‌రావును అడిగి తెలుసుకున్నారు. కాగా శుక్రవారం ఏపీ సరిహద్దులోని గోగులపూడి అటవీ ప్రాంతంలోగల శ్రీ గుబ్బల మంగమ్మ తల్లి ఆలయాన్ని సందర్శిస్తారు.

నేటి నుంచి మార్కెట్‌కు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం నుంచి ఆదివారం వరకు సెలవులు ఉన్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి బి.బజార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవంతో పాటు శని, ఆదివారాలు వారాంతపు సెలవులు వచ్చాయని పేర్కొన్నారు. తిరిగి సోమవారం మార్కెట్‌లో కొనుగోళ్లు మొదలవుతాయనే అంశాన్ని రైతులు, వ్యాపారులు గమనించాలని ఆయన కోరారు.

కిష్టాపురానికి మరో గౌరవం

- మహేందర్‌రెడ్డికి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పదవి
- డీజీపీగా విధులు నిర్వర్తించిన 'ముదిరెడ్డి'

కూసుమంచి: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) నూతన చైర్మన్‌గా మాజీ డీజీపీ ముదిరెడ్డి మహేందర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన స్వగ్రామమైన కూసుమంచి మండలం కిష్టాపురానికి అరుదైన గౌరవం దక్కినట్లయింది. మహేందర్‌రెడ్డి నియామకంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంజనీరింగ్.. ఆపై ఐపీఎస్

కూసుమంచి మండలం కిష్టాపురంలో 1962 డిసెంబర్ 3న ముదిరెడ్డి నారాయణరెడ్డి – అచ్చమ్మ దంపతులకు ఆరో సంతానంగా మహేందర్‌రెడ్డి జన్మించారు. మధ్యతరగతి కుటుంబం కావడంతో బాల్య విద్య కిష్టాపురంలో, 7వ తరగతి వరకు కూసుమంచి ప్రభుత్వ పాఠశాలలో చదివాక 8 నుంచి 10వ తరగతి వరకు సర్వేల్‌లోని గురుకుల పాఠశాల, నాగార్జునసాగర్‌లోని రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ విద్య పూర్తి చేశారు. ఆ తర్వాత వరంగల్‌లోని ఆర్‌ఈసీ(నేటి నిట్)లో ఇంజనీరింగ్ చదివిన మహేందర్‌రెడ్డి 1986లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించాక తెలంగాణ డీజీపీగా 2017 నవంబర్‌లో నియమితులై 2022 డిసెంబర్ వరకు కొనసాగారు. ఆయన హయాంలోనే ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు శ్రీకారం చుట్టి పోలీస్ వ్యవస్థలను పటిష్టం చేసి శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో టీఎస్‌పీఎస్సీలో అక్రమాలు జరగగా.. ప్రస్తుత ప్రభుత్వం సమర్థుడైన అధికారిగా పేరున్న మహేందర్‌రెడ్డిని చైర్మన్‌గా నియమించింది.



ముదిరెడ్డి మహేందర్‌రెడ్డి

ఓటు వజ్రాయుధం



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ప్రియాంక, అధికారులు

జాతీయ ఓటరు దినోత్సవంలో కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిష్పక్షపాతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ఓటరు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. బెలూన్లను గాలిలోకి వదిలి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు బలమైన ఆయుధమని, దీనిని పారదర్శకంగా వినియోగించి సుపరిపాలన అందించే వారిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఓటుహక్కు ప్రాముఖ్యత, నమోదు, పారదర్శక వినియోగం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో అర్హులంతా ఓటరుగా నమోదు కావాలని కోరారు. అనంతరం ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఆర్డీఓ శిరీష, డీఎస్పీ రెహమాన్, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, డీటీ అంజాద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు

విప్ సరే.. క్యాంప్ ఎందుకో?

గోవాలో ఇల్లెందు కౌన్సిలర్లు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై అవిశ్వాస నోటీస్ జారీ అయిన వెంటనే కౌన్సిలర్లను క్యాంపునకు తరలింపు, క్యాంపులో ఉండగానే విప్ జారీ అయింది. గతేడాది కాలంగా ఇల్లెందు మున్సిపాలిటీ రాజకీయం రసవత్తరంగా మారింది. చైర్మన్ డీవీపై ఆరోపణలు చేస్తున్న కౌన్సిలర్ల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. దీనికి తోడు అందరినీ సమన్వయం చేస్తూ, 21వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి సరితను చైర్‌పర్సన్ సీటులో కూర్చోబెట్టాలని ఆమె భర్త గణేష్ కంకణం కట్టుకున్నారు. గణేష్ ప్రవేశంతో మున్సిపల్ రాజకీయం మలుపు తిరిగింది. 19 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మానాన్ని ఈనెల 11న కలెక్టర్‌కు అందజేయగా, 18న కలెక్టర్ నోటీస్ జారీ చేశారు. అదేరోజు రాత్రి 15 మంది కౌన్సిలర్లను గోవాలోని క్యాంప్‌నకు తరలించారు. వారు అక్కడ ఉండగానే బుధవారం విప్ జారీ అయింది. అయితే విప్ జారీ చేశాక క్యాంప్‌లో ఉండాల్సిన అవసరం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పార్టీ ఆదేశాలు పాటించకపోతే అనర్హత వేటు పడడం కోసమే విప్ పని చేస్తుంది కదా అని అంటున్నారు. కాగా, క్యాంప్‌లో ఉన్నవారితో పాటు పార్టీ మారిన వారికి కూడా విప్ జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే గతంలో ఎన్నో సందర్భాల్లో విప్‌లు జారీ చేశారని, ఆ విప్‌లతో ఎంతమంది పదవులు కోల్పోయారని అధికార కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. కాగా, ఫిబ్రవరి 5న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు.

గ్రామపంచాయతీగానే మణుగూరు

దాఖలైన పిటిషన్‌పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కొత్త మున్సిపాలిటీల జాబితాలో మణుగూరును చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ, పంచాయతీగానే కొనసాగిస్తూ ఎన్నికలు నిర్వహించాలని దాఖలైన పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ అభ్యంతరాలపై స్పందించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రధాన కార్యదర్శి, కమిషనర్, డైరెక్టర్, పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, మణుగూరు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసిన హైకోర్టు.. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. మున్సిపాలిటీల జాబితాలో షెడ్యూల్డ్ తెగల ప్రాంతమైన మణుగూరును రాష్ట్ర ప్రభుత్వం చేర్చడాన్ని సవాల్ చేస్తూ కోడి నాగరాజు, మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. మణుగూరును మున్సిపాలిటీగా ప్రకటించడం మంచిదే కదా.. పంచాయతీతో పోలిస్తే ఎక్కువ నిధులు రావడమే కాకుండా పరిపాలన కూడా మెరుగవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019లో మణుగూరును గ్రామపంచాయతీగానే పేర్కొన్నందున ఆమేరకు ఎన్నికలు జరిపేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

ప్రయోగ 'పరీక్ష'

- జూనియర్ కాలేజీల్లో రసాయనాల కొరత
- మూడేళ్లుగా నిలిచిన సరఫరా
- కెమికల్స్, పరికరాలు లేకుండానే ప్రాక్టికల్స్
- ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లోనూ అదే తీరు

బూర్గంపాడు: జూనియర్ కళాశాలల్లో ప్రయోగాలు మొక్కుబడి తంతుగా మారాయి. విద్యార్థుల అభ్యున్నతి, ఉన్నత చదువులకు ఇంటర్మీడియెట్ కీలకం. ఇంటర్ సైన్స్ (ఎంపీసీ, బైపీసీ) కోర్సుల విద్యార్థులకు తరగతి గదుల్లో బోధించిన పాఠాలను ప్రాక్టికల్‌గా చూపించేందుకు ప్రత్యేకంగా ప్రయోగశాలలు ఉంటాయి. ల్యాబ్‌ల్లో విద్యార్థులతో అధ్యాపకులు ప్రయోగాలు చేయించి ఫలితాలను గుర్తించేలా తర్ఫీదు ఇస్తారు. ఇంటర్‌లో ప్రాక్టికల్ మార్కులు కూడా కీలకమే. అయితే ప్రభుత్వాల నిర్లక్ష్యంతో జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ పరేషాన్‌గా మారాయి. ల్యాబ్‌ల్లో సరైన పరికరాలు, రసాయనాలు అందుబాటులో లేకపోవడంతో ఈ తంతు మొక్కుబడిగా సాగుతోంది.

ఎప్పటికీ గుర్తుండేలా..

ఇంటర్మీడియెట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీలకు ప్రత్యేక ల్యాబ్‌లుంటాయి. ఈ సబ్జెక్ట్‌ల్లో పాఠాల బోధన తర్వాత అదేరోజు అందులోని అంశాలను ల్యాబ్‌ల్లో ప్రయోగాలు చేయించాలి. పాఠాలు విన్న వెంటనే ప్రాక్టికల్స్ చేయిస్తే అవి ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఇందుకోసం కాలేజీల్లో ల్యాబ్‌ల ఏర్పాటుతో పాటు ల్యాబ్ ఇన్‌చార్జ్‌లను కూడా నియమిస్తారు. అయితే కొన్ని కళాశాలల్లో ఎలాంటి రసాయనాలు, పరికరాలు లేకుండానే, తరగతి గదుల్లో చెప్పిన పాఠాలనే ల్యాబ్‌లలో రివైజ్ చేస్తున్నారు. కొన్ని కాలేజీల్లో అయితే ల్యాబ్ గదుల తలుపులు తీసిన పాపాన పోవడం లేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మూడేళ్లుగా రసాయనాలు, పరికరాలు సరఫరా కావడం లేదు. దీంతో ప్రాక్టికల్స్ అనేవి విద్యార్థులకు, అధ్యాపకులకు విషమ పరీక్షగా మారాయి. ఇక కొన్ని ప్రైవేటు కళాశాలల్లో అసలు ల్యాబ్‌లే లేవు. ఈ క్రమంలో ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు ఇంటర్ బోర్డ్ షెడ్యూల్ విడుదల చేసింది. ఇందుకు అవసరమైన రసాయనాలు, పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ కళాశాలల్లో పాత సామగ్రితోనే 'మమ' అనిపిస్తున్నారు. రసాయనాలు, పరికరాల కొరతపై ప్రిన్సిపాళ్లు ఇంటర్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో పరీక్షలు విద్యార్థులకు శాపంగా మారాయి.

ఒకేషనల్ కోర్సులదీ అదే పరిస్థితి..

ఇంటర్ విద్యలో కొన్నేళ్లుగా ఒకేషనల్ (వృత్తి విద్య) కోర్సులు కూడా తీసుకొచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎక్కువగా ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్), సీటీ (కాంక్రీట్ టెక్నీషియన్) తదితర కోర్సులు అమలు చేస్తున్నారు. ఇవి పూర్తిగా ప్రాక్టికల్స్ ఆధారంగానే నడుస్తాయి.



బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కెమిస్ట్రీ ల్యాబ్

అయితే ఈ కోర్సులకు సంబంధించిన ల్యాబ్‌ల్లో కూడా ఎలాంటి రసాయనాలు, పరికరాలు అందుబాటులో ఉండటం లేదు. ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులో మైక్రో స్కోప్‌లు, హిమోగ్లోబిన్ మీటర్లు, స్పాటర్ ఐడెంటిఫికేషన్లు, సెంట్రీఫ్యూజ్ వంటి వస్తువులతో పాటు రసాయనాలు కూడా అవసరం. సీటీ కోర్సులో కూడా చెయిన్లు, సిమెంట్, ఇసుక, ప్లంబింగ్‌కు సంబంధించిన పరికరాలు అవసరమైనా.. ఎక్కడా అందుబాటులో లేవు. దీంతో వృత్తి విద్యా కోర్సులు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నాం

ల్యాబ్‌ల నిర్వహణకు అవసరమైన రసాయనాలు, ఇతర సామగ్రి కొనుగోలుకు కొంత కాలంగా నిధులు రావడం లేదు. అయితే కళాశాలల అవసరాల గురించి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నాం. ప్రయోగాలకు అవసరమైన రసాయనాలను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులే కొంతమేర కొనుగోలు చేసి ప్రాక్టికల్స్ చేయిస్తున్నారు. ల్యాబ్‌లకు అవసరమైన రసాయనాలు, ఇతర సామగ్రి ఈ ఏడాది అందే అవకాశాలున్నాయి.

– సులోచనా రాణి, డీఐఈఓ

క్లుప్తంగా

పట్టభద్రులు ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ మంగీలాల్

భద్రాచలంఅర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు 1 జనవరి 2020 నాటికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై గురువారం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దరఖాస్తులకు డిగ్రీ సర్టిఫికెట్ జత చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రతీ మండలానికి ప్రత్యేక ఎన్నికల అధికారిని నియమించినట్లు తెలిపారు. ఈ సదస్సులో తహసీల్దార్ శ్రీనివాస్, డివిజన్ పరిపాలనా అధికారి రాజారావు, డిప్యూటీ తహసీల్దార్ (ఎలక్షన్) మణిధర్, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సుజాతనగర్ మండలం సర్వారం తండాకు చెందిన భూక్య ప్రసాద్‌కు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ గురువారం అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ (పోక్సో) జడ్జి శ్యాంశ్రీ తీర్పు చెప్పారు. భూక్య ప్రసాద్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని చుంచుపల్లి మండలం వెంకటేశ్వరకాలనీకి చెందిన వివాహిత 2022లో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దుమ్ముగూడెం : మండలంలోని లచ్చిగూడెం గ్రామానికి చెందిన సొందె రాముడు(31) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఎస్ఐ గణేష్ కథనం ప్రకారం..రాముడు ఈ నెల 1న కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య గురువారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో ఇద్దరు బలి

- తల్లి గర్భంలోనే శిశువు మృతి
- మృతశిశువును తొలగించడంలో వైద్యుల జాప్యం
- పరిస్థితి విషమించి తల్లి కూడా మృత్యువాత
- కొత్తగూడెంలోని మాతాశిశు కేంద్రంలో ఘటన



భార్య, బిడ్డ మృతి చెందటంతో ఆస్పత్రి వద్ద విలపిస్తున్న వీరేంద్రనాథ్, బంధువులు





మృతి చెందిన శిశువు, సింధు (ఫైల్)

కొత్తగూడెంరూరల్/సింగరేణి(కొత్తగూడెం) : ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యంతో తల్లీబిడ్డలు ఇద్దరూ మృతి చెందారు. తల్లి గర్భంలో చనిపోయిన శిశువును తొలగించడంలో జాప్యం చేయగా తల్లి కూడా మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రామవరంలో ఉన్న మాతా శిశు సంరక్షణ కేంద్రంలో బుధవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం .. సుజాతనగర్ మండలం నాయకులగూడెం గ్రామానికి చెందిన చింతాల వీరేంద్రనాథ్ సుజాతనగర్‌లో సబ్ స్టేషన్‌లో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ పనిచేస్తున్నాడు. అతని భార్య సింధు (23) గర్భిణి కావడంతో పురిటి నొప్పులు రాగా బుధవారం ఉదయం 10 : 30 గంటలకు మాతా శిశు సంరక్షణ కేంద్రంలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని, ఆపరేషన్ చేయాలని బంధువులు, కుటుంబ సభ్యులకు చెప్పారు. అనంతరం మరోసారి సింధుకు స్కానింగ్ చేయించి, కడుపులో బిడ్డ పరిస్థితులు సక్రమంగా లేవని చెప్పారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు కడుపులోనే బిడ్డ చనిపోయిందని తెలిపారు. ఈ విషయం తల్లికి తెలియనివ్వకూడదని సూచించారు. సాయంత్రం 6 గంటలకు సింధు గర్భంలో ఉన్న శిశువు తొలగించే ప్రక్రియ ప్రారంభించారు. అనంతరం తల్లి సింధు ఫిట్స్ వచ్చి మృతి చెందిందని తెలిపారు. ఆ విషయం కూడా ఆలస్యంగా చెప్పారు. కడుపులో బిడ్డ మృతి చెందిన విషయం మధ్యాహ్నామే గుర్తించిన వైద్యులు తక్షణమే ఆపరేషన్ చేసి, శిశువును తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని సింధు భర్త వీరేంద్రనాథ్, బంధువులు పేర్కొంటున్నారు. సకాలంలో వైద్యసేవలు అందించకపోవడంవల్లే తల్లీబిడ్డలు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులతో వాగ్వాదానికి దిగారు. ఇద్దరి మృతికి కారకులైన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలు బంధువులు గురువారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ రమేష్ తెలిపారు. కాగా మృతదేహానికి జిల్లా సర్వజన ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తిచేశారు.

రెండు నెలల క్రితం కూడా ఇలాంటి ఘటనే..

మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం పెరిగిందని, రోగులకు డాక్టర్లు సకాలంలో చికిత్స అందించడం లేదని కొంతకాలంగా ఆరోపణలు వస్తున్నాయి. రెండు నెలల క్రితం కూడా ఇలాంటి సంఘటనే చోటుచేసుకుంది. చికిత్స అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో టేకులపల్లి మండలానికి చెందిన తల్లీబిడ్డలు మృతి చెందారు. అప్పుడు జిల్లాస్థాయి అధికారులు విచారించి చర్యలు తీసుకుంటే బుధవారం తల్లీబిడ్డలు మృతి చెంది ఉండేవారు కాదని పలువురు పేర్కొంటున్నారు.

ధ్యాస అంతా సొంత క్లినిక్‌లపైనే..

మాతా శిశు సంరక్షణ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న కొందరు వైద్యులు కాసులకు కక్కుర్తి పడి ప్రైవేట్‌గా ఆస్పత్రులు నడుపుకుంటున్నారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చిన గర్భిణులను తీసుకెళ్లి తమ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్పించుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విధినిర్వహణలో సమయపాలన పాటించడంలేదని, వారి ఆస్పత్రులకు కేసులు వచ్చినట్లు ఫోన్‌వస్తే విధుల మధ్యలో ఉన్నపళంగా వెళ్లిపోతున్నారనే విమర్శ కూడా ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాస్పత్రిలో వైద్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో మాతా శిశువులు మృతి చెందుతున్నారని పలువురు పేర్కొంటున్నారు.

కడుపులో బిడ్డ చనిపోవడం వల్లే తల్లి మృతి

ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్ల సింధు చనిపోలేదు. కడుపులో బిడ్డ చనిపోవడంతో ఇన్‌ఫెక్షన్ వచ్చి బుధవారం రాత్రి తల్లి గుండెపోటుకు గురై మృతి చెందింది. తల్లి పరిస్థితి విషమించటంతో డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్లాలని సూచించారు. సింధుకు ఫస్ట్ డెలివరీ అప్పుడే గర్భ సంచి సమస్య ఉంది.

–బోడ కుమారస్వామి, సూపరింటెండెంట్

శోకసంద్రంలో నాయకులగూడెం

మూడేళ్లకే తల్లిని కోల్పోయిన బాలుడు





మృతదేహం వద్ద రోదిస్తున్న సింధు తండ్రి, బంధువులు, (ఇన్‌సెట్) సింధు-వీరేంద్రనాథ్ మొదటి సంతానం హిమాన్ష

సుజాతనగర్: తల్లీబిడ్డల మృతితో నాయకులగూడెం గ్రామం శోకసంద్రంగా మారింది. ప్రసవం అనంతరం బిడ్డతో ఇంటికి వస్తానని అనుకున్న ఆ తల్లి.. భర్తకు, మూడేళ్ల కుమారుడికి దూరమై తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. సుజాతనగర్ మండలం నాయకులగూడెం గ్రామానికి చెందిన చింతాల వీరేంద్రనాథ్‌కు, అదే గ్రామానికి సింధుతో 2020లో వివాహం జరిగింది. ఈ దంపతులకు మొదటి సంతానంగా కుమారుడు అభయ్ హిమాన్ష జన్మించగా, అతనికి ఇప్పుడు మూడేళ్లు. మొదటి బిడ్డ నెలలు నిండక ముందే జన్మించడంతో అనారోగ్యానికి గురికాగా వైద్యంచేయించి కాపాడుకున్నారు. సింధు రెండో కాన్పు కోసం బుధవారం కొత్తగూడెంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లారు.

కుమారుడిని ముద్దాడి..

కాన్పు నిమిత్తం ఆస్పత్రికి వెళ్లేముందు సింధు బుధవారం ఉదయమే కుమారుడిని ముద్దాడి పాఠశాలకు పంపింది. తాను ఆస్పత్రికి వెళ్లినట్లు కొడుకుకు తెలియనివ్వొద్దని కుటుంబ సభ్యులకు చెప్పింది. అనంతరం ఆస్పత్రిలో చేరి విగతజీవిగా ఇంటికి తిరిగి వచ్చింది. వైద్యుల నిర్లక్ష్యంతో తల్లీబిడ్డలు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. మృతదేహం వద్ద భర్త, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోదించిన తీరు పలువురి హృదయాలను కలచివేసింది. తల్లి మృతి చెందిందనే విషయం తెలియని చిన్నారి హిమాన్షను చూసి ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టుకున్నారు.

స్ట్రెచర్‌పై యాష్ బస్తాలా..?



ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యవసర రోగులను తరలించే స్ట్రెచర్‌ను బూడిద బస్తాల కోసం వినియోగిస్తున్నారు. సీహెచ్‌సీ ఆస్పత్రికి తెప్పించిన యాష్(బూడిద) బస్తాలను.. గురువారం ఆస్పత్రి ముందు నుంచి ఆవరణలోకి స్ట్రెచర్‌పై తరలించారు. అదే సమయంలో ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో అత్యవసర వైద్యం కోసం ఓ బాధితుడి రాగా, స్ట్రెచర్ లేకపోవడంతో కాలినడకనే ఆస్పత్రిలోకి తీసుకెళ్లాల్సి వచ్చింది. కాగా ఆస్పత్రిలో పని చేస్తున్న సెక్యూరిటీ, ఇతర ఔట్ సోర్సింగ్ సిబ్బందితో వారికి సంబంధం లేని పనులు చేయించడం గమనార్హం.

–అశ్వారావుపేటరూరల్

ఐటీడీఏ పీఓకు ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలంలో శనివారం జరిగే జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రారంభోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్‌కు భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవాదానం, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ ట్రోఫీ క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రాజీవ్‌ట్రోఫీ పేరిట నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మహిళా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కొత్త సీతారాములు, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టోర్నీ నిర్వాహకులు ఎం.డీ.మతిన్ ప్రారంభించారు. ఈమేరకు 16జట్ల క్రీడాకారులు పాల్గొనగా డ్రా తీసి ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహించారు.

కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని యూబీ రోడ్డులో రెండు లారీలను రోడ్డుపై నిలిపి దుకాణదారుడు సామగ్రి దిగుమతి చేసుకుంటున్నాడు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగగా, రెండు లారీల డ్రైవర్లు, దుకాణం యజమానిపై కేసు నమోదు చేసినట్లు భద్రాచలం సీఐ నాగరాజురెడ్డి తెలిపారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న వ్యక్తి అరెస్టు


- నిందితుడు అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ ఉద్యోగి
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్‌రాజ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్, పక్కన డీఎస్పీ, సీఐ

చుంచుపల్లి : మత విద్వేషాలు రెచ్చగొట్టేలా లేఖలు రాస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేయగా, ఎస్పీ రోహిత్‌రాజ్ గురువారం చుంచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. కొత్తగూడెంలోని బాబుక్యాంప్ ఏరియాకు చెందిన గైక్వాడ్ కైలాష్ కుమార్ అశ్వాపురంలోని భారజల కర్మాగారంలో సీనియర్ క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలలుగా హిందువులకు వ్యతిరేకంగా ముస్లింల పేరుతో, ముస్లింలను కించపరుస్తూ హిందువుల పేర్లతో లేఖలు రాస్తున్నాడు. కొందరు మహిళల శరీర భాగాలను అసభ్యంగా అభివర్ణిస్తూ కూడా ఉత్తరాలు రాస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇక గతేడాది నవంబర్‌లో జిహాద్ పేరుతో బాబు క్యాంపులోని వేంకటేశ్వరస్వామి దేవాలయానికి బెదిరింపు లేఖలు పంపించడంతో కైలాష్‌కుమార్‌పై మొదటి కేసు నమోదు కాగా, ఇప్పటివరకు ఆరు కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు. చుంచుపల్లి పోలీసులు సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా బుధవారం సాయంత్రం అతడిని అరెస్టు చేశారని చెప్పారు. ఎవరైనా మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తించినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, చుంచుపల్లి సీఐ పెద్దన్న కుమార్, ఎస్సై ప్రవీణ్ కుమార్‌తో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

భద్రాచలంఅర్బన్: పట్టణంలో నూతన బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో గుర్తు తెలియని మృతదేహాన్ని గురువారం గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. గోదావరిపై నిర్మాణం జరుగుతున్న రెండో వంతెన సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడు నీలం రంగు షర్టు, బ్లూ రంగులో ఉన్న గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. కుడి చేతి వేలికి వినాయకుడి గుర్తుతో ఉన్న ఉంగరం ఉందని, , మృతుడి వయసు 50 ఏళ్లు ఉండవచ్చని, ఆచూకీ తెలిసిన వ్యక్తులు 87126 82106 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు పేర్కొన్నారు. సీఐ నాగరాజు రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

కరకగూడెం: మండల పరిధిలో గురువారం రాత్రి వేర్వేరుగా జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. బంగారుగూడెం గ్రామానికి చెందిన బంగారు లక్ష్మీనర్సయ్య సమీప గ్రామమైన కలవనాగరంలో ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో కాటాపురం నుంచి వస్తున్న ఆటో వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి.

లక్ష్మీపురంలో..

భట్టుపల్లి గ్రామ పంచాయతీలోని లక్ష్మీపురం ప్రధాన రహదారిపై మణుగూరు నుంచి కరకగూడెం వస్తున్న ఆటో, కరకగూడెం నుంచి వీరాపురం వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ముడిగ అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కరకగూడెం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి మణుగూరు 100 పడకల ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

రామానుజవరం వాసికి రాష్ట్రపతి అవార్డు

- జైళ్లశాఖ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న రామయ్య



రామయ్యను అభినందిస్తున్న సౌమ్యామిశ్రా

మణుగూరు రూరల్: మణుగూరు మండలం రామానుజవరం గ్రామానికి చెందిన జైలర్ యడారి రామయ్య రాష్ట్రపతి అవార్డుకు ఎంపిక య్యారు. రామయ్య కాకతీయ యూనివర్సిటీ నుంచి పీజీ పూర్తిచేశాక 1999లో డిప్యూటీ జైలర్‌గా ఉద్యోగం సాధించారు. ఆతర్వాత జైలర్‌గా పదోన్నతి పొందిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని జైళ్లశాఖ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన విధినిర్వహణలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్రపతి అవార్డుకు ఎంపిక చేసింది. ఈసందర్భంగ రామయ్యను జైళ్ల శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ సౌమ్యామిశ్రా, అధికారులు, రామానుజవరం గ్రామస్తులు అభినందించారు.

జైలు సూపరిటెండెంట్‌కు..



ఏ.శ్రీధర్

ఖమ్మంరూరల్: ఖమ్మం జిల్లా జైలు సూపరింటెండెంట్ ఏ.శ్రీధర్‌కు కేంద్రప్రభుత్వం ప్రెసిడెంట్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ అవార్డు ప్రకటించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం విడుదల చేసిన జాబితాలో ఆయనకు స్థానం దక్కడంతో జైళ్ల శాఖ, ఖమ్మం జిల్లా జైలు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

రిపబ్లిక్‌డే ఉత్సవాలకు ఎంపిక



విలాసిని

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన రాష్ట్రంలోని 30 మంది గిరిజన విద్యార్థులు ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలను తిలకించడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈమేరకు ఖమ్మం రూరల్ మండలంలోని గొల్లగూడెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వాంకుడోత్ విలాసిని కూడా ఎంపికవడంతో ప్రధానోపాధ్యాయుడు వీ.ఏ.ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

కొబ్బరిచెట్టు ఇలా ఎక్కాలి!



కొబ్బరి చెట్టు ఎక్కే విధానంపై శిక్షణ ఇస్తున్న ట్రెయినీలు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో కొబ్బరి అభివృద్ధి బోర్డు, ఉద్యాన శాఖ ఆధ్వర్యాన కొబ్బరిమిత్ర పేరిట నిరుద్యోగ యువతకు ఏర్పాటుచేసిన శిక్షణ కొనసాగుతోంది. ఈమేరకు గురువారం మాస్టర్ ట్రెయినీల ఆధ్వర్యాన యంత్రాల సాయంతో కొబ్బరి చెట్లు ఎక్కే విధానం, కొబ్బరి కాయలు కోసే పద్ధతి, చీడపీడల గుర్తింపుపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ప్రొఫెసర్ కోటేశ్వరరావు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

మత్స్యశాఖ అధికారులతో పీఓ సమీక్ష

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు జిల్లాల మత్స్యశాఖ అధికారులతో భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ గురువారం పలు అంశాలపై సమీక్షించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఏజెన్సీ ప్రాంత చెరువుల్లో చేపపిల్లల విడుదల, దిగుబడిపై చర్చించారు. అలాగే, ఏజెన్సీ ఏరియాలోని అన్ని చెరువులకు ట్రైబల్స్ సొసైటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీసా గ్రామ సభల ద్వారా చెరువులపై హక్కులు కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఓ జనరల్ హెచ్.డేవిడ్‌రాజ్, అధికారులు జి.అశోక్, సురేష్, ఎస్.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 13మంది ఎంపిక



నియామకపత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం జిల్లా ఉపాధికల్పన శాఖ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 13మందిని ఎంపిక చేశారు. మెడ్‌ప్లస్‌లో ఉద్యోగాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 40మంది అభ్యర్థులు హాజరు కాగా ఇందులో 13 మందికి నియామకపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇక తప్పించుకోలేరు..



కాచనపల్లి సమీపాన అనంతోగు క్రాస్‌లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు (ఇన్‌సెట్) చెక్ పోస్టు వద్ద సీసీ కెమెరాలు

అటవీ సంపద అక్రమ రవాణాకు చెక్

- స్మగ్లర్ల కట్టడికి చెక్‌పోస్టులు, సీసీ కెమెరాలు
- అధికారులు ఎక్కడి నుంచైనా ఫుటేజీ పరిశీలించే వెసులుబాటు
- ఇల్లెందులో తొలిసారిగా ఏర్పాటుతో సత్ఫలితాలు



సీసీ కెమెరాలో నమోదవుతున్న వాహనాల రాకపోకలు

ఇల్లెందు: అటవీ ప్రాంతం నుంచి సంపదను తరలించేందుకు అక్రమార్కులకు చెక్ పెట్టేలా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. అటవీశాఖ యంత్రాంగం నిరంతరం గస్తీ తిరుగుతున్నా ఎక్కడో ఒక చోట నుంచి అక్రమంగా సంపద తరలివెళ్తోంది. దీన్ని పూర్తిగా అరికట్టేందుకు గాను ఇల్లెందు అటవీ డివిజన్‌లో అధికారులు వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టారు. అటవీ ప్రాంతం నుంచి ఉన్న అన్నిమార్గాల్లో కొత్తగా చెక్‌పోస్టులు ఏర్పాటుచేయడంతో పాటు సోలార్ విద్యుత్‌తో నడిచే సీసీ కెమెరాలు అమర్చారు. అంతేకాక ఈ కెమెరాల ఫుటేజీ నోటిఫికేషన్ అటవీశాఖ డివిజన్ అధికారి(ఎఫ్‌డీఓ)కి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. తద్వారా అక్రమార్కులు సంపదను తరలించినా.. చెక్‌పోస్టుల ఉద్యోగులు చూసీచూడనట్లు వ్యవహరించినా ఎక్కడి నుంచైనా ఆదేశాలు జారీ చేసే అవకాశం ఏర్పడుతోంది.

లక్ష ఎకరాల్లో అటవీ ప్రాంతం

ఇల్లెందు అటవీ డివిజన్ పరిధిలో సుమారు లక్ష ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అడవిని కాపాడేందుకు ఇల్లెందు, కొమురారం, కాచనపల్లి, గుండాలలో రేంజ్ కార్యాలయాలు, 96 బీట్లు ఏర్పాటు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని డివిజన్లల్లో ఇల్లెందు డివిజన్‌లోనే ఎక్కువ అటవీ భాగం ఉండగా... అటవీ సంపదను కాపాడేందుకు ఉద్యోగులు అహర్నిశలు శ్రమించాల్సి వస్తోంది. ఈ నేపథ్యాన కొన్ని కీలక ప్రదేశాలను గుర్తించి సోలార్ విద్యుత్ సాయంతో సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. ముఖ్యంగా స్మగ్లర్లు గుండాల, ఆళ్లపల్లి, కాచనపల్లి అటవీప్రాంతాల గుండా ఇల్లెందుకు చేరుకోవాలంటే గుండాల రోడ్డును ఎంచుకుంటారు. ఈ మార్గంలో కాచనపల్లి సమీపంలో అనంతోగు క్రాస్ రోడ్డును ఒక పాయింట్‌గా, మర్రిగూడెం పెట్రోల్ బంక్ ముందు నుంచి బోడు వెళ్లే రహదారిని మరో పాయింట్‌గా ఎంపిక చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అంతేకాక అనంతోగు క్రాస్ వద్ద కొత్త చెక్ పోస్టు కూడా ఏర్పాటు చేశారు.

ప్రతీ వాహనం తనిఖీ చేయాల్సిందే..

ఎంపిక చేసిన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఫుటేజీని ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న మొబైల్‌కు అనుసంధానం చేశారు. తద్వారా సిబ్బంది ఏదైనా వాహనాన్ని తనిఖీ చేయకుండా వదిలేస్తే హెచ్చరించే అవకాశం ఏర్పడనుంది. కాగా, అనంతోగు క్రాస్ వద్ద చెక్‌పోస్టుకు ఒక బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించడమే కాక ఇద్దరు బేస్ క్యాంప్ సిబ్బందిని కేటాయించారు. వీరు గుండాల, ఆళ్లపల్లి మీదుగా వచ్చే ప్రతీ వాహనం తనిఖీ చేస్తున్నారు. త్వరలోనే మర్రిగూడెం పెట్రోల్ బంక్ ముందు నుంచి బోడు క్రాస్ రోడ్డులోనూ ఇంకో చెక్‌పోస్టు ఏర్పాటు చేయనున్నారు. కాగా, ప్రస్తుతం అమర్చిన సీసీ కెమెరాల ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. సిబ్బందిలో జవాబుదారీతనం పెరగడమే కాక అధికారుల పర్యవేక్షణకు వీలవుతోంది. తాజాగా గుండాల మార్గం నుంచి కలప తీసుకొస్తున్న ఓ వాహనం మర్రిగూడెం మీదుగా టేకులపల్లి వెళ్లి ఇల్లెందుకు వస్తుండగా ఎఫ్‌డీఓ వెంకన్న సీజ్ చేశారు.

రోల్ మోడల్‌గా ఇల్లెందు

నిరంతరం పనిచేసేలా ఏర్పాటుచేసిన సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసిన ఇల్లెందు అటవీ డివిజన్ రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా నిలవనుంది. ఇదేతరహాలో మిగతా చోట్ల కూడా అటవీ సంపద తరలివెళ్లే మార్గాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే గస్తీ సులభం కానుందని భావిస్తున్నారు. ఇల్లెందు మాదిరి తొలుత జిల్లాలో, ఆపై రాష్ట్రమంతా ఏర్పాటుచేసే అవకాశమున్నాయని సమాచారం.

మరిన్ని ప్రాంతాలను గుర్తిస్తున్నాం..



అటవీ ప్రాంతం నుంచి సంపద తరలింపునకు స్మగ్లర్లు రోజుకో మార్గం ఎంచుకుంటున్నారు. వీరి తీరుతో ఉద్యోగులకు నష్టం జరుగుతోంది. ఒక్క చెట్టు నరికి వేస్తే చెట్టు విలువ ఆధారంగా ఉద్యోగుల వేతనంలో కోత పడుతుంది. అందుకే అక్రమ రవాణాను అరికట్టేందుకు సీసీ కెమెరాలు అమర్చి నిఘా పెంచాం. అడవుల పరిరక్షణే లక్ష్యంగా మరి న్ని ప్రాంతాల్లో కెమెరాలు బిగించాలని భావిస్తున్నాం.

– కె.వెంకన్న, అటవీ శాఖ ఇల్లెందు డివిజన్ అధికారి

డీసీఎంఎస్ చైర్మన్ 'రాయల'పై వేటు



ఖమ్మం డీసీఎంఎస్ కార్యాలయం (ఇన్‌సెట్) రాయల వెంకట శేషగిరిరావు

- రుణం చెల్లింపులో నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ
- తొలుత పీఏసీఎస్ డైరెక్టర్‌గా అనర్హత..
- తద్వారా పీఏసీఎస్, డీసీఎంఎస్ చైర్మన్ పదవులూ దూరం
- డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాలకు చైర్మన్ బాధ్యతలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావుపై అనర్హత వేటు పడింది. డీసీసీబీ నుంచి ఆయన తీసుకున్న వాహన రుణ వాయిదాలు సకాలంలో చెల్లించకపోవడంతో జిల్లా సహకార అధికారి ఎ.విజయకుమారి 1964 సహకార చట్టం ప్రకారం చర్యలు తీసుకున్నారు. తల్లాడ మండలం మిట్టపల్లికి చెందిన రాయల వెంకట శేషగిరిరావు అదే మండలంలోని గంగదేవిపాడు పీఏసీఎస్ డైరెక్టర్‌గా 2020 ఫిబ్రవరిలో ఎన్నికయ్యారు. ఆ తర్వాత పీఏసీఎస్ చైర్మన్‌గా, డీసీఎంఎస్ డైరెక్టర్‌గా అవకాశం రాగా చైర్మన్ పదవి దక్కించుకున్నారు. శేషగిరిరావుకు ఇంకా 14 నెలల పదవీ కాలం ఉండగానే అనర్హత వేటు పడింది.

రాష్ట్రంలో అధికారం మార్పుతో...

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యాన రాజకీయంగా అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం చైర్మన్‌గా ఉన్న రఘునాథపాలెం మండలం వీవీ.పాలెం పీఏసీఎస్‌లో ఆయనపై అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. ఇంతలోనే డీసీఎంఎస్ చైర్మన్ సైతం పదవి కోల్పోయారు.

వాయిదా మీరిన బకాయి కారణంగానే...

డీసీసీబీ నుంచి 2018 అక్టోబర్ 24న శేషగిరిరావు వాహన కొనుగోలుకు రూ.27 లక్షల రుణం తీసుకున్నారు. 2023 జనవరి 2 నాటికి వాయిదాలు పేరుకుపోగా, 2023 ఫిబ్రవరి 12వ తేదీ వరకు రూ.25,93,569 బకాయి పడ్డారు. రెండేళ్ల పది నెలల పాటు వాయిదాలు చెల్లించకపోవడంతో అధికారులు నోటీసులు ఇవ్వగా ఆయన ఈనెల 18న బకాయి చెల్లించారు. అయినా సకాలంలో రుణం చెల్లించకపోవడంతో సహకార చట్టం ప్రకారం గంగదేవిపాడు పీఏసీఎస్ డైరెక్టర్‌గా శేషగిరిరావుపై అనర్హత వేటు వేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫలితంగా ఆయన ఈ పీఏసీఎస్ చైర్మన్‌గానే కాక డీసీఎంఎస్ చైర్మన్ పదవిని సైతం కోల్పోతారని జిల్లా సహకార అధికారి విజయకుమారి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన స్థానంలో మరో డైరెక్టర్‌ను కోఆప్షన్ విధానంలో ఎన్నుకుని 11మంది డైరెక్టర్ల నుంచి ఒకరిని చైర్మన్‌ను ఎన్నుకునే అవకాశముంది.

డీసీఎంఎస్ చైర్మన్‌గా వైస్ చైర్మన్



కొత్వాల శ్రీనివాసరావు

డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావుపై అనర్హత వేటు పడటంతో వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్న కొత్వాల శ్రీనివాసరావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగించే అవకాశముందని సమాచారం. రాష్ట్ర సహకార రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ విశాల సహకార సంఘం చైర్మన్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు ప్రస్తుతం వైస్‌చైర్మన్ పదవిలో కొనసాగుతున్నారు.

ఖర్గేను కలిసిన పొంగులేటి సోదరులు





ఖర్గేతో మాట్లాడుతున్న పొంగులేటి సోదరులు, మున్షీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో గురువారం జరిగిన కాంగ్రెస్ బూత్ స్థాయి, ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేత కేసీ.వేణుగోపాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన సోదరుడు ప్రసాదరెడ్డి కలవగా ప్రసాదరెడ్డిని ఖర్గే, కేసీ వేణుగోపాల్‌కు మంత్రి పరిచయం చేశారు.

దీపాదాస్ మున్షీని కలిసిన తుమ్మల

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్, ఏఐసీసీ సభ్యురాలు దీపాదాస్ మున్షీని గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించగా.. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.

తమ్మినేనికి 'ఫేస్ మేకర్'



వీరభద్రంతో మాట్లాడుతున్న విజయరాఘవన్

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల అస్వస్థతకు గురైన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయనకు బుధవారం శస్త్రచికిత్స చేసిన వైద్యులు గుండె వద్ద ఫేస్ మేకర్ అమర్చారని, ప్రస్తుతం తమ్మినేని ఆరోగ్యం సాధారణ స్థితికి చేరుకుంటోందని కుటుంబీకులు తెలిపారు. కాగా, వీరభద్రంను గురువారం సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయ రాఘవన్, రాష్ట్ర, జిల్లా నాయకులు పోతినేని సుదర్శన్, ఎస్.నవీన్‌రెడ్డి, రాయల శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు. తమ్మినేని కుమారుడు సంఘమిత్ర, కుమార్తె శృతితో మాట్లాడారు.

ఫాసిజంను వ్యతిరేకించే శక్తి కమ్యూనిస్టులకే..

సీపీఐ సెమినార్‌లో డాక్టర్ యుగల్ రాయలు



సెమినార్‌లో మాట్లాడుతున్న యుగల్ రాయలు

ఖమ్మంమయూరిసెంటర్: ఫాసిజంను వ్యతిరేకించే శక్తి ఒక కమ్యూనిజానికే ఉన్న విషయంప్రధాని నరేంద్ర మోడీకి సైతం తెలుసునని నాగ్‌పూర్‌లోని ధరమ్‌పేట్ సైన్స్ కాలేజీ రిటైర్డ్ హెచ్‌ఓడీ డాక్టర్ యుగల్ రాయలు అన్నారు. లెనిన్ శతవర్ధంతి సందర్భంగా ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం 'లెనినిజం – సమకాలీన ప్రపంచం' అంశంపై పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. సమకాలీన ప్రపంచంలో ప్రతీ సమస్యకు పరిష్కారం చూపగలిగింది మార్క్సిజమేనని తెలిపారు. సిద్ధాంతాన్ని ఆచరణలో అనుసరించి చూపిన మహోన్నత వ్యక్తి లెనిన్ అని చెప్పారు. ఆయన రాసిన గ్రంథాలు అత్యంత ప్రచార్యం పొంది జనచైతన్యానికి దోహదపడ్డాయని తెలిపారు. కాగా, దేశాన్ని పెట్టుబడిదారులు కబళిస్తున్న నేపథ్యాన లెనిన్ చెప్పినట్లుగా చిన్న వ్యాపారులకు ప్రజలు మద్దతుగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కమ్యూనిస్టులు ఉన్నంతవరకు దేశంలో సంక్షేమపథకాలు అమలవుతాయని యుగల్ రాయలు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు భాగం హేమంతరావు, జమ్ముల జితేందర్‌రెడ్డి, మహ్మద్ మౌలానా, దండి సురేష్, శింగు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆధ్వర్యంలో మినీ రైస్ మిల్



మినీ మిల్లు వద్ద రైతు సంఘం నాయకులు

దమ్మపేట: పామాయిల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యాన దమ్మపేటలో మినీ రైస్ మిల్లు ఏర్పాటు చేశారు. ఈ మిల్లును ఎఫ్‌పీఓ స్కీం ద్వారా నాఫెడ్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేయగా ఉత్తమ రైతు అవార్డు గ్రహీత అంకత ఉమమహేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. రైతు సంఘాల ఎఫ్‌పీఓ స్కీంను వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఈకార్యక్రమంలో నాయకులు కొయ్యల అచ్యుతరావు, యాట్ల వెంకమ్మ, రూప్‌సింగ్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు ఎంతైనా ఖర్చుచేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన వారు తీసుకునే సీపీఆర్ఎంఎస్ కార్డ్ ద్వారా ఇచ్చే చికిత్సలో దీర్ఘకాలిక వ్యాధులైన కిడ్నీ, గుండె, కేన్సర్, పక్షవాతం తదితర వ్యాధులకు ఎంత మొత్తమైనా ఖర్చు చేయాలని ఏబీకేఎంఎస్ జాతీయ నాయకులు పి. మాధవ్‌నాయక్ డిమాండ్ చేశారు. కోలిండియాలో ఇదే విధానం అమల్లో ఉందని చెప్పారు. కోల్‌కతాలో గురువారం జరిగిన సీపీఆర్ఎంఎస్–ఎన్ఈ బోర్డ్ ట్రస్ట్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాగా, ఈ మేరకు సర్క్యులర్ జారీ చేస్తామని ఉన్నతాధికారులు భరోసా ఇచ్చారని చెప్పారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. సీపీఆర్ఎంఎస్ – ఎన్ఈ స్కీంలోని సభ్యులకు ఔట్ పేషంట్ చికిత్సలో భార్యాభర్తలిద్దరికీ ఏడాదికి రూ.25 వేల చొప్పున రూ. 50వేలు రీయింబర్స్‌మెంట్ చేయాలని నిర్ణయించారు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే ఒకరు రిటైర్డ్ అయి, మరొకరు పని చేస్తుంటే రిటైర్డ్ అయిన వారికి చికిత్స అవసరమైతే పనిచేస్తున్న వారికి డిపెండెంట్‌గా పరిగణించాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. దివ్యాంగులైన పిల్లలకు క్రిటికల్ డిసీస్‌తో వైద్య సౌకర్యం చేసినా అన్‌లిమిటెడ్‌లోనే చికిత్స అందించాలని కూడా ఉత్తర్వులు జారీ చేయాలని సమావేశం నిర్ణయించిందని పేర్కొన్నారు. చికిత్స అనంతరం 45 రోజుల్లోగా సంబంధిత బిల్లులను యాజమాన్యానికి అందజేస్తే ఖర్చు మొత్తాన్ని చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

ఎట్టకేలకు రైతులకు పరిహారం



ప్రాజెక్టు వద్ద పరిశీలిస్తున్న ఆర్డీఓ, అధికారులు

కల్లూరు రూరల్: కల్లూరు మండలం లక్ష్మీపురంలోని అటవీ ప్రాంతంలో 1998లో పంగిడి ప్రాజెక్టు నిర్మించగా అప్పుడు సేకరించిన భూములకు గాను రైతులకు పరిహారం చెల్లించేందుకు రంగం సిద్ధమైంది. ఆ సమయాన 24 మంది రైతులు అరవై ఎకరాల భూమి కోల్పోయారు. అయితే, వీరికి 2004లో ఎకరాకు రూ.55వేల చొప్పున ప్రభుత్వం పరిహారాన్ని మంజూరు చేసినా అది సరిపోదంటూ కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారు. ఇటీవల కోర్టు తీర్పు రావడంతో అదే పరిహారాన్ని వడ్డీతో సహా రైతులకు చెల్లించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈక్రమంలోనే కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, తహసీల్దార్ పులి సాంబవుడు, డీటీ బాబ్జీప్రసాద్ తదితరులు పంగిడి ప్రాజెక్టును సందర్శించి రైతులతో మాట్లాడారు.

ఖమ్మం బస్టాండ్‌లో ఆర్‌ఎం తనిఖీ



కొత్త బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ఆర్‌ఎం వెంకన్న

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని కొత్త బస్టాండ్‌ను రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్‌లో పరిశుభ్రతతో పాటు ప్లాట్‌ఫాంలపై కూర్చునేందుకు ఉన్న వసతులు పరిశీలించారు. అలాగే, స్టాళ్లు, క్యాంటీన్లలో పరిశుభ్రత, నాణ్యత పాటించేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆతర్వాత కార్గో విభాగాన్ని కూడా ఆర్‌ఎం పరిశీలించారు. డిపో మేనేజర్ బి.శ్రీనివాస్‌తో పాటు ఉద్యోగులు రామశెట్టి రామయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన ప్రకాశం స్టేడియం



ముస్తాబైన ప్రధాన వేదిక




స్టేడియంలోకి వెళ్లే మార్గంలో పతాకాలు

గణతంత్ర వేడుకలకు కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ ఏరియా పరిధి ప్రకాశం స్టేడియం ముస్తాబైంది. సింగరేణి వ్యాప్తంగా నిర్వహించే ఈ వేడుకలకు అన్ని ఏరియాల పరిధిలోని జీఎంలు హాజరవుతారు. ఇక్కడ సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండా ఎగురవేయనున్నారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న సీఎండీ ప్రసంగం అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. ఆతర్వాత సింగరేణి సంస్థలో ఉత్తమ ఉద్యోగులు, కార్మికులుగా ఎంపిక చేసిన వారిని సీఎండీ సన్మానిస్తారు.

– సింగరేణి(కొత్తగూడెం)

75 ఆకారంలో ప్రదర్శన



75 ఆకారంలో విద్యార్థులు

భద్రాచలంలోని సెయింట్ పాల్స్ లూథరస్ పాఠశాలలో 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 75 ఆకారంలో ప్రదర్శన ఇవ్వగా.. ప్రిన్సిపాల్ రాధామంజరి, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

– భద్రాచలంటౌన్

100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ



ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పాల్వంచ నెహ్రూనగర్‌లోని నారాయణ స్కూల్ ఆధ్వర్యాన గురువారం 100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని నారాయణ విద్యాసంస్థల ఏజీఎం ఎస్.వేణుగోపాల్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావుతో పాటు వి.శ్రీనివాస్, డి.రామకృష్ణ, రుచిత, పద్మ, మల్లేశ్, సుజిత, అంజన్‌కుమార్, అనూష, శ్వేత, దీప్తి, కల్యాణి, నాగూర్, బి.శ్రీలత పాల్గొన్నారు. – పాల్వంచ